సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం ၊ 26 ၊ ఏప్రిల్ ၊ 2023



ఆర్టీసీ టెంపుల్ టూరిజం

ఆదాయం పెంపు లక్ష్యంగా ఆర్టీసీ కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. దీనిలో భాగంగా టెంపుల్ టూరిజంపై దృష్టి పెట్టింది. 8లో



కేజీబీవీలో నాణ్యమైన బోధన

కేజీబీవీలో నాణ్యమైన బోధన అందుతుందని, బడి బయట బాలికలను చేర్పించాలని జీసీడీవో సూర్యకుమారి తెలిపారు. 8లో



సింగర్భలో చక్కుల పండగ

గిరిజనుల జీవనవిధానం వైవిధ్యంగా ఉంటుంది. వారి ఆచార వ్యవహారాలకు చక్కుల పండగ అద్దం పడుతోంది. 8లో

న్యూస్‌రీల్

ఉత్సాహంగా గుర్రపు పందాలు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ మాధవి

కొయ్యూరు: ఎర్రగొండమ్మ తల్లి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం శరభన్న పాలెంలో నిర్వహించిన గుర్రపు పందాలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి జెండా ఊపి ప్రారంభించారు. మొదటి బహుమతి చోడవరం మండలం గవరవరానికి చెందిన చెందిన మోదమాంబ ఠాగూర్ పేరు గల గుర్రం దక్కించుకుంది. ద్వితీయ బహుమతి దేవరాపల్లికి చెందిన మాధురి సాయి, మూడో బహుమతి రామన్నపాలెంకు చెందిన బోడమాంబ విక్రమ్ పేరు గల గుర్రం సాధించాయి. మొదటి బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు.తృతీయ బహుమతిగా రూ.20 వేలు విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు మహేష్, నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్, కొయ్యూరు సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐ రాజారావు, సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్ట్రక్చర్ సర్వే వేగవంతం



ధర్మతాళ్లగూడెంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

వీఆర్‌పురం: పోలవరం ప్రాజెక్ట్ ముంపు పరిధిలో ప్రయారిటీ హేబిటేషన్లగా గుర్తించబడిన గ్రామాల్లో స్ట్రక్చర్ (నివాస గృహాలు) సర్వే ముమ్మరంగా జరుగుతోంది. ధర్మతాళ్లగుడెం గ్రామంలోని సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎన్.శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని రామవరప్పాడు,అడివివెంకన్నగుడెం, ప్రత్తిపాక, చింతరేగుపల్లి, గుండుగుడెం, రాజుపేటకాలనీ, ధర్మతాళ్లగుడెం, వడ్డిగూడెం, వీఆర్‌పురం గ్రామాల్లో సర్వే బృందాలు సర్వే ప్రక్రియను ప్రారంభించారని ఆయన తెలిపారు. సర్వే సమయంలో సర్వే బృందాలకు నిర్వాసితులు అందుబాటులో ఉండి సహకరించాలని ఆయన సూచించారు.

గిరిజన రోగులకు తక్షణ చికిత్స అందించండి



కేజీహెచ్ ట్రైబల్‌సెల్ సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ జమాల్ బాషా

మహారాణిపేట : గిరిజన రోగులకు తక్షణం చికిత్స అందించాలని ఏఎస్‌ఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా కేజీహెచ్ వైద్యులను కోరారు. మంగళవారం ట్రైబల్ సెల్‌ను సందర్శించిన ఆయన అత్యవసర చికిత్సల కోసం కేజీహెచ్‌కు వచ్చే గిరిజన రోగులకు సెల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. గిరిజనుల కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాల ఫలాలు వారికి అందేలా చిత్తశుద్ధితో సిబ్బంది విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పసికందు మృతి



మృతిచెందిన పసికందు

అనంతగిరి: మండలంలోని మారుమూల కివర్ల పంచాయతీ జగడల మామిడి గ్రామానికి చెందిన సత్యారావు, రాజులమ్మ దంపతులకు చెందిన రెండు నెలల పసికందు అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందింది. చిన్నారికి కడుపు పొంగడంతో అనారోగ్యానికి గురైంది. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో కుటుంబ సభ్యులు జగడలమామిడి గ్రామం సుమారు 10 కిలోమీటర్ల మేర కాలి నడకన తీసుకువెళ్లారు. అక్కడి నుంచి బొర్రా పాలెం మీదుగా పినకోట పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతిచెందినట్లుగా వైద్య సిబ్బంది తెలిపారు. గ్రామానికి రహదారి సౌకర్యం ఉంటే సకాలంలో వైద్యసేవలు అంది ఉండేవని, ఇప్పటికైనా రహదారి నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


మసకబారిన మాచ్‌ఖండ్

ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో చుట్టూ ఎత్తయిన కొండలు.. జాలువారే జలపాతాలు.. ప్రకృతి సోయగాల మధ్య పురుడుపోసుకున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం లక్ష్యసాధనలో వెనుకబడిపోతోంది. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటినిల్వలు పుష్కలంగా అందుబాటులో ఉన్నా వినియోగించుకోలేకపోతోంది. పురాతన యంత్రాలు కావడంతో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఆరు జనరేటర్లలో ప్రస్తుతం నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి.



జోలాపుట్టు జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం

- పుష్కలంగా నీటి నిల్వలు
- పురాతన యంత్రాల వల్ల తరచూ మొరాయింపు
- విద్యుత్ ఉత్పత్తిపై సాంకేతిక సమస్యల ప్రభావం
- ఆరింటిలో నాలుగు మాత్రమే పనిచేస్తున్న జనరేటర్లు



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో 6 జనరేటర్లు ఉన్నాయి. 1,2,3 జనరేటర్ల ద్వారా 51 మెగావాట్లు, 4,5,6 జనరేటర్ల ద్వారా 69 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. పాత యంత్రాలు కావడంతో గత పదేళ్లుగా పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరిగిన దాఖలాలు లేవు. తరచూ విద్యుత్ కేంద్రంలో నెలకొంటున్న సాంకేతిక సమస్యలు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంపై ప్రభావితం చేస్తున్నాయి. నాగార్జున సాగర్, సీలేరు వంటి జలవిద్యుత్ కేంద్రాలు కేవలం పీక్‌లోడ్ అవర్స్‌లోనే ఉత్పాదన చేస్తున్నాయి. అయితే మాచ్‌ఖండ్ మాత్రం ఏడాది పొడవునా విద్యుత్ ఉత్పత్తిని చేసే సామర్థ్యం ఉన్నా అది సాధ్యం కావడం లేదు. ప్రస్తుతం విద్యుత్ కేంద్రంలో 1,2,3,5 జనరేటర్ల ద్వారా 72 మెగావాట్లు మాత్రమే విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.

పుష్కలంగా నీరు

జిల్లాలో మాచ్‌ఖండ్‌తోపాటు సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలకు జోలాపుట్టు, డుడుమ జలాశయాల నీరు ప్రధాన ఆధారం. మాచ్‌ఖండ్‌లో ఉత్పత్తి అనంతరం నీటిని దిగువున ఉన్న మూడు ప్రాజెక్టులకు విడుదల అవుతుంది. ప్రస్తుతం డుడుమ, జోలాపుట్టు జలాశయాలు నిండుగా ఉన్నాయి.

మత్స్యగెడ్డ నీరే దిక్కు

డుడుమ, జోలాపుట్టు జలాశయాలకు మత్స్యగెడ్డ నీరే దిక్కు. ఈ గెడ్డ పాడేరు డివిజన్ జి. మాడుగుల మండలం గెమ్మెలి నుంచి మొదలై మత్స్యగుండం మీదుగా పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల మీదుగా ఆయా ప్రాజెక్టుల్లో చేరుతుంది. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటిని ఈ రెండు ప్రాజెక్టుల్లో నిల్వ చేస్తారు.

- మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదల అయ్యే నీటి ద్వారా అప్పర్ సీలేరులో 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. అక్కడ నుంచి ఆంధ్ర భాగస్వామ్యం మొదలయి డొంకరాయి వద్ద 25 మెగావాట్లు, లోయర్ సీలేరు వద్ద 460 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేసిన అనంతరం గోదావరిలో కలుస్తుంది.
- డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటినిల్వలు పుష్కలంగా ఉన్నా మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి పూర్తిగా నీటిని వినియోగించుకోవడం లేదు. ఇక్కడ 4,6 జనరేటర్లు మరమ్మతుల్లో ఉన్నాయి. వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.
- డుడుమ జలాశయంలో 2590 అడుగుల నీటి సామర్థ్యం కాగా ప్రస్తుతం 2,577 అడుగులు, జోలాపుట్టులో 2750 అడుగుల సామర్థ్యం కాగా 2726.55 అడుగుల మేర నీరు ఉంది.
- ప్రస్తుతం మన్యంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుల నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. ఈ నీటిని మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోయినా దిగువున ఉన్న సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని బలిమెల జలాశయం మీద ఆధారపడి ఉన్న మూడు జల విద్యుత్ కేంద్రాలు పూర్తిగా వినియోగించుకుంటున్నాయి.

ఒడిశా అధికారుల వినతి మేరకు..

- బలిమెల జలాశయంలో ఆశించిన స్థాయిలో ప్రస్తుతం నీటి నిల్వలు లేవు. దీంతో అదనపు నీటి కోసం బలిమెల జలాశయ అధికారులు ఏపీ జెన్‌కో అధికారులను కోరడంతో సోమవారం నుంచి డుడుమ జలాశయం నుంచి రెండు గేట్ల ద్వారా 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మాచ్‌ఖండ్ ప్రాజెక్టును ఆధునికీకరించాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు.

గంజాయి దందాకు బిగుస్తున్న ఉచ్చు

- స్మగ్లర్లకు కొంత మంది పోలీసుల సహకారం
- సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు

రంపచోడవరం/చింతూరు: ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో గంజాయి దందాతో ప్రమేయం ఉన్న పోలీసుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. రూ.2 లక్షల లంచం తీసుకుని గంజాయి లోడును మోతుగూడెం ఎస్‌ఐ సత్తిబాబు వదిలేయడాన్ని రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. గంజాయి స్మగ్లర్లతో సరిహద్దు ప్రాంతంలోని పోలీసుస్టేషన్ల సిబ్బందిలో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయన్న దానిపై వారు కూపీలాగడం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది.

చెక్‌పోస్టులు ఉన్నా..

ఏజెన్సీలోని డొంకరాయి, మోతుగూడెం పోలీస్ స్టేషన్ల మీదుగా వెళ్లే ప్రతీ వాహనాన్ని ఆయా పోలీస్ స్టేషన్ చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేసి వదిలిపెట్టాలి. ఈ పరిస్థితుల్లో పోలీస్‌స్టేషన్లు దాటుకుంటూ నెల్లూరులో పట్టుబడిన గంజాయి వ్యవహారంలో లోతుగా విచారణ జరుగుతోంది. గంజాయి రవాణాతో ప్రమేయం ఉన్న ప్రైవేట్ వ్యక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. దీనిపై త్వరలోనే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

తక్కువ ధరకే లభించడంతో..

ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో గంజాయి తక్కువ ధరకే లభిస్తుంది. రిస్కు తీసుకుని తరలించుకుపట్టుకుపోతే ఊహించనంతా ఆదాయం వస్తుంది. దీంతో అక్రమం వ్యాపారం పట్ల ఆకర్షితులవుతున్నారు. పటిష్టమైన పోలీస్ నిఘా ఉన్నప్పటికి ఎలాగోలా గంజాయి తరలించుకుపోయేందుకు స్మగర్లు శతావిధాల ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు పోలీసులపై కూడా పూర్తిస్థాయిలో విచారణ ప్రారంభం కావడంతో ఈ అక్రమ దందాతో సంబంధం ఉన్న అందరికి వెన్నులో వణుకుపుడుతోంది.

త్వరలో డ్రైవింగ్ లైసెన్సు మేళా

చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్



చింతపల్లి: చింతపల్లిలో త్వరలో డ్రైవింగ్ మేళాను ఏర్పాటుచేయనున్నట్టు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ మంగళవారం తెలిపారు. ఇటీవల చింతపల్లి ముత్యాలమ్మజాతరలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదుల విభాగానికి డ్రైవింగ్ లైసెన్సులపై వెయ్యి వరకు యువత నుంచి వినతులు వచ్చాయన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని త్వరలో చింతపల్లి కేంద్రంగా డ్రైవింగ్ లైసెన్సు మేళాను పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి సంబంధించిన అనుమతులకోసం కలెక్టర్, ఐటీడీఏ పీవో, రవాణా శాఖ అధికారులకు లేఖలు రాస్తున్నామని చెప్పారు. చదువుకుని ఖాళీగా ఉండి ఉద్యోగాన్వేషణకోసం ఎదురు చూస్తున్న గిరిజన నిరుద్యోగ యువతీ యువకుల కోసం తాము ప్రత్యేకంగా ఒక కార్యక్రమాన్ని అమలు చేయనున్నామని ఆయన వెల్లడించారు. దిక్సూచి పేరిట చింతపల్లిలోని లైబ్రరీని ఆధునికీకరిస్తామన్నారు. అక్కడ ఉద్యోగార్థులకు ఉపయోగపడే సమాచారాన్ని అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కంప్యూటర్, ఇంటర్‌నెట్, ప్రింటర్లు, స్కానర్లు, డిజిటల్ స్క్రీన్, వంటివి అందుబాటులో ఉంచుతామని తెలిపారు.అవసరమైతే ఆన్‌లైన్లో తరగతులు వినేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. వీటిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.త్వరలో గంజాయి నిర్మూలన, బాల్య వివాహాలు, మద్యం, జూదం, రంగురాళ్ల వంటి అసాంఘిక కార్యక్రమాలకు గిరిజనులు దూరంగా ఉండేలా వారిని చైతన్య పరిచేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజనులను ఆకట్టుకునేలా వీడియోలను రూపొందించి వాటితో వినోదభరిత కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూనే వారిని చైతన్య పరుస్తామని ఆయన పేర్కొన్నారు.జాతరలు, పండగలతోపాటు వారపుసంతల్లో గిరిజనులకు ఉపయోగపడేలా మొబైల్ ఆధార్ సేవలను కొనసాగిస్తామని అదనపు ఎస్పీ శివ ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

- ముందు జాగ్రత్తలతోనే మలేరియా నివారణ
- ఐటీడీఏ పీవో అభిషేక్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి, పాడేరు : కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద మలేరియా నివారణపై అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. దోమల పెరుగుదలను అరికట్టడానికి డ్రై డే పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపడితే ప్రజలను మలేరియా బారిన పడకుండా కాపాడవచ్చని అన్నారు. దోమ తెరల వినియోగంపై గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ర్యాలీని అంబేడ్కర్ కూడలి నంచి ఐటీడీఏ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సాంబమూర్తి పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించండి

కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశానికి హాజరైన సీడీపీవోలు, సూపర్‌వైజర్లు

సాక్షి, పాడేరు : ప్రజలకు కుటుంబ నియంత్రణ పట్ల పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల ఐసీడీఎస్, సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కుటుంబ నియంత్రణపై గిరిజనుల్లో అవగాహన లేకపోవడం కూడా అనారోగ్యం, రక్త హీనతతో పిల్లలు పుట్టడానికి కారణమన్నారు. కుటుంబ నియంత్రణ వల్ల అవగాహన కల్పించడం వల్ల చాలా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. జిల్లాలో అనేక మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి తగు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యసేవలు, మందులు అందించాలని సూచించారు. ముఖ్యంగా ఐరన్, పోలిక్ యాసిడ్, మల్టీ విటమిన్లు అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భవతులను ముందుగానే గుర్తించి నమోదు చేయడం ద్వారా వారిని పర్యవేక్షించేందుకు వీలవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆర్‌సీహెచ్ నమోదు ముందుగా చేయాలని పలువురు సీడీపీవోలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సంబంధించి ఆరోగ్య శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతీ సూపర్‌వైజర్‌నెలలో కనీసం పది నుంచి 15 గ్రామాల్లో పర్యటించాలని, అంగన్‌వాడీ కార్యకర్తలకు రక్తహీనత, గర్భిణులు, బాలింతల నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్య బాధ్యత ఆశా వర్కర్, ఏఎన్‌ఎంలదే కాదని, అంగన్‌వాడీలకు కూడా ఉందని గుర్తించాలన్నారు. మండలాల వారీగా నలుగురు కన్నా ఎక్కువ మంది పిల్లలను కనిన వారికి గ్రామ సర్పంచులు, వైద్యాధికారులు, తహసీల్దార్, ఎంపీడీవోల ద్వారా కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారుడికి కేవైసీ తప్పనిసరి

జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి శివప్రసాద్

పాడేరు రూరల్ : ప్రతి ఒక్క రేషన్‌కార్డుదారుడికి కేవైసీ తప్పనిసరిగా చేయాల్సిందేనని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఆర్. శివప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని మండలం సుద్రుపుట్టు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుంద్రుపుట్టు గ్రామ సచివాలయ పరిధిలో 236 మంది కార్డుదారులకు కేవైసీ చేయకపోవడాన్ని గుర్తించారు. వారికి సంబంధిత గ్రామ సచివాలయ వలంటీర్లు వారంలోగా కేవైసీ పూర్తి చేయాలని సూచించారు. సుంద్రుపుట్టు గ్రామ సచివాలయంలో ముగ్గురు కార్డుదారులకు ప్రింట్ తీసి కార్డులు ఇవ్వకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ముద్రించి ఇవ్వాలని సూచించారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే గ్రామ సచివాలయ శాఖ జిల్లా కోఆర్డినేటర్ 7386885544, ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ ఇంచార్జిని 9948303431 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు. కార్డుదారుల కుటుంబంలో పిల్లలు జన్మిస్తే ఆ వివరాలు కూడా రేషన్ కార్డులో పొందుపర్చాలన్నారు. మరణిస్తే ధ్రువీకరణ పత్రం ఆధారంగా కార్డులో తొలగించాలని ఆయన ఆదేశించారు.

భర్త ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

మృతుని భార్య మరోసారి ఫిర్యాదు

రాజవొమ్మంగి: తమ కుటుంబంలో చిచ్చుకు కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని అమ్మిరేఖల గ్రామానికి చెందిన ఎల్లెం లక్ష్మి, గ్రామస్తులతో కలిసి మంగళవారం ఎస్‌ఐ గోపీనరేంద్రప్రసాద్‌కు మరోసారి ఫిర్యాదు చేసింది. తన భర్త ఎల్లం వెంకటేశ్వర్లు (35) రెండు వారాల క్రితం గడ్డిమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆమె పేర్కొంది. తన భర్త మనోవేదనకు జడ్డంగికి చెందిన ఓ వ్యక్తి కారణమని ఆమె ఆరోపించింది. దీనిపై ఇటీవల పాడేరులోని కలెక్టర్ కార్యాలయంతోపాటు, రాజవొమ్మంగి పోలీసుస్టేషన్‌లోను ఫిర్యాదు చేసినట్టు ఆమె గుర్తుచేసింది. అయినప్పటికీ న్యాయం జరగకపోవడంతో మరోసారి ఎస్‌ఐకు ఫిర్యాదు ఇచ్చామని ఆమె పేర్కొంది. దీనిపై ఎస్‌ఐ గోపీ నరేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ విషయాన్ని రంపచోడవరం ఏఎస్పీ దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

అడుగంటిన డొంకరాయి జలాశయం

- విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత
- ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఎస్‌ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్

మోతుగూడెం: డొంకరాయి జలాశయంలో నీటి మట్టం తగ్గిపోవడంతో జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని మంగళవారం నిలిపివేసినట్లు ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఎస్‌ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. డొంకరాయి జలాశయం నిల్వ సామర్థ్యం 1,037 అడుగులు కాగా, 990 అడుగులకు తగ్గిపోయిందన్నారు. సరిపడా నీరు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్టు ఆయన వివరించారు. జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోయినప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేస్తే వైబ్రేషన్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని ఎగువన ఉన్న బలిమెల జలాశయంలో కూడా నీటి నిల్వలు బాగా తక్కువగా ఉన్నందున మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం డుడుమ డ్యామ్ నుంచి 3,200 క్యూసెక్కుల నీరు బలిమెలకు వస్తుందన్నారు. బలిమెలలో ఆంధ్రా వాటా 9.5 టీఎంసీలు, గుంటవాడ, డొంకరాయిల్లో 3.5 టీఎంసీలు మొత్తంగా 13 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. వర్షాలు పడి జలాశయాలు నిండే వరకు ఈ నీటిని విద్యుత్ ఉత్పత్తి, తాగునీటి అవసరాలకు వినియోగిస్తామన్నారు. ప్రస్తుతం కాంప్లెక్సు పరిధిలోని సీలేరు, పొల్లూరు విద్యుత్ కేంద్రాల్లో అత్యవసర వేళల్లో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఆయన వెల్లడించారు.

జెరాక్స్ ప్రశ్నపత్రాలతో పరీక్షలు

రాజవొమ్మంగి: సాధారణంగా పరీక్షలు జరుగుతున్నాయంటే ఆ పరిసర ప్రాంతాల్లోని జెరాక్స్ సెంటర్లన్నీ మూసివేస్తారు. కానీ ప్రస్తుతం మండల వ్యాప్తంగా గల వంద పాఠశాలల్లో జరుగుతున్న సీబీఏ-3 ఫైనల్ పరీక్షలకు చెందిన ప్రశ్నాపత్రాల కోసం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు జిరాక్సు సెంటర్లపైనే ఆధారపడాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఈనెల 22 నుంచి 26 వరకు ఒకటవ తరగతి నుంచి 9వ తరగతి వరకు సీబీఏ-3 ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి. కాగా ఈ పరీక్షలకు చెందిన ప్రశ్నపత్రాలు ఆయా పాఠశాలలకు పూర్తిస్థాయిలో అందలేదు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇక ప్రశ్నపత్రాన్ని సంపాదించి జిరాక్సు కాపీలు తీయిస్తున్నారు. వీటిని విద్యార్థులకు అందజేసి పరీక్షలు రాయిస్తున్నారు. దీనిపై ఎంఈవో తాతబ్బాయిదొరను వివరణ కోరగా స్థానిక విద్యావనరుల కేంద్రానికి వచ్చిన ప్రశ్నపత్రాల బండిళ్లను హెచ్‌ఎంలు ఇష్టానుసారంగా తీసుకొని వెళ్లిపోయారన్నారు.

ఏయూ అధికారులతో ఎస్టీ కమిషన్ చైర్మన్ భేటీ



మాట్లాడుతున్న కుంభా రవిబాబు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ ఆలుమ్ని సమావేశ మందిరంలో వర్సిటీ అధికారులు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఏయూలో బోధన, బోధనేతర ఉద్యోగాల భర్తీలో రోస్టర్ అమలు చేస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. వర్సిటీ, అనుబంధ కళాశాలల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తున్న విధానంపై సమగ్ర నివేదికను రెండు వారాల్లో అందించాలని ఆయన సూచించారు. ఎస్టీ కమిషన్ సభ్యులు వి.శంకర్‌నాయక్, కొర్ర రామలక్ష్మి, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో డీడీ తనిఖీలు



పనసలపాలెం ఆశ్రమపాఠశాలలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ జాన్‌రాజు



పనసలపాలెం ఆశ్రమ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ

వై.రామవరం: మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన సంక్షేమశాఖ డీడీ ఇ.జాన్‌రాజ్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన యార్లగడ్డ బాలికల ఆశ్రమ పాఠశాల, పనసలపాలెం ఆశ్రమ పాఠశాల, వై.రామవరం ఆశ్రమ పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. నాడు– నేడు అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకున్నారు. పిల్లలకు వండిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఆయా పాఠశాలలు నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మండల అకాడమిక్ అధికారి జి.ఆనందరావు, హెచ్‌ఎంలు మద్దికొండ రూన్సీరాణి, పల్లాల లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు వేతనాల మంజూరు



ఉమ్మడి విశాఖ జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం

విశాఖ విద్య: సమగ్ర శిక్ష అభియాన్(ఎస్‌ఎస్‌ఏ) ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన నిధులు విడుదలయ్యాయి. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల వరకు వేతనాలతో పాటు, పారితోషకాలకు సైతం నిధులు మంజూరు చేస్తూ ఎస్‌ఎస్‌ఏ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ స్టాఫ్, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న వారికి సైతం వేతనాలు చెల్లించేలా నిధులు కేటాయించారు. విశాఖపట్నం జిల్లాకు రూ.2.42 కోట్లు, అనకాపల్లికి రూ.6.39 కోట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు రూ.5.02 కోట్లు విడుదల చేశారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించి, నివేదికలు అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం ముగిసినా వేతనాలు మంజూరు కాని పరిస్థితి ఉండేది. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నారు. 2022–23 విద్యా సంవత్సరం ఈ నెల 30వ తేదీతో ముగిస్తుండగా, ముందుగానే వేతనాలకు సంబంధించిన నిధులు విడుదల చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

ఘనంగా శంకరాచార్య జయంతి

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రంలో శంకరాచార్య జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శంకరాచార్య జననం నుంచి అవతార సమాప్తి వరకు లోకకల్యాణం విశేషాలను కూలంకుషంగా పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య వివరించారు. అనంతరం శంకరాచార్య విగ్రహానికి సహస్రనామార్చన, అభిషేకం, నీరాజన మంత్ర పుష్పాలను సమర్పించారు. పది గ్రామాలకు సరిపడా గంగాలమ్మ పుట్టింటి చీర, సారె పూజా సామగ్రి అందుబాటులో ఉందని, ఆసక్తి గల వారు తీసుకెళ్లవచ్చని ఆయన తెలిపారు.

ఎంపీని కలిసిన మన్యం గాయకుడు దుడ్డు



ఎంపీతో మాట్లాడుతున్న దుడ్డు

కొయ్యూరు: తన మధురమైన స్వరంతో గిరిజనులను చైతన్యవంతం చేస్తున్న మన్యం గాయకుడు, రచయిత దుడ్డు సత్యనారాయణ మంగళవారం అరకు ఎంపీ మాధవిని ఆమె స్వగ్రామం శరభన్నపాలెంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మన్యంలో నెలకొన్న సమస్యలపై ఎంపీతో చర్చించారు. అనేక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీ తెలిపారు. పాటల ద్వారా గిరిజనులను చైతన్య పరచాలని కోరారు. మంచి రచయితగా రాణించాలని ఆకాంక్షించారు.

క్రికెట్ బెట్టింగ్‌కు విద్యార్థి బలి

అనకాపల్లిటౌన్ : క్రికెట్ బెట్టింగ్‌లో నష్టపోయిన విద్యార్థి పి.మధు ఆత్మహత్యకు పాల్పడగా విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు రూరల్ ఎస్‌ఐ అంజిబాబు చెప్పారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలివి. మండలంలో దిబ్బపాలెం గ్రామానికి చెందిన పి.మధు క్రికెట్ బెట్టింగ్‌లో నష్టం వచ్చిందని ఆవేదన చెందుతూ ఈనెల 23వ తేదీన గ్రామ సమీపంలో పొలాల్లో గులుకులు సేవించాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు విశాఖ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఆర్టీసీ టెంపుల్ టూరిజం

- ప్రతి పౌర్ణమికి అరుణాచల యాత్ర
- కాణిపాకం, శ్రీపురం, కంచి, శ్రీకాళహస్తిల దర్శనం
- ప్యాకేజీ ధర ఒక్కొక్కరికి రూ.4,000
- వారాంతంలో పూరీ, భువనేశ్వర్‌లకు స్పెషల్స్
- సంవత్సరం పొడవునా నడపాలని నిర్ణయం
- ఆదాయం పెంపు కోసం ఆర్టీసీ కొత్తమార్గాల అన్వేషణ



అరుణాచలం ఆలయ వ్యూ

సాక్షి, విశాఖపట్నం : ఆదాయం పెంపు కోసం ఆర్టీసీ కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ప్రయాణికుల ద్వారా వచ్చే రాబడికంటే దానికయ్యే ఖర్చే అధికంగా ఉంటోంది. అయినప్పటికీ సేవా దృక్పథంతో ప్రజల కోసం బస్సులను నడుపుతోంది. దీంతో ఇతర ఆదాయ మార్గాలపై దృష్టి సారిస్తోంది. ఇప్పటికే లాజిస్టిక్స్ ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరుతోంది. కొత్తగా కార్గోలో డోర్ డెలివరీ, పికప్ సదుపాయాలను కూడా ప్రవేశపెట్టింది. దీనికి వినియోగదార్ల నుంచి ఆదరణ బాగుంటోంది. ఈ నేపథ్యంలో సరికొత్తగా టెంపుల్ టూరిజంపై ఫోకస్ పెట్టింది. ఇందులోభాగంగా విశాఖపట్నం నుంచి తమిళనాడులోని అరుణాచలం, పొరుగున ఒడిశాలో ఉన్న పూరీ సహా మరికొన్ని పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ఇప్పటికే నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి అరుణాచలానికి 120 వరకు ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. ప్రతి పౌర్ణమికి అరుణాచల గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తుతుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విశాఖ (ద్వారకా బస్‌స్టేషన్) నుంచి అరుణాచలానికి ప్రతి పౌర్ణమికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. మే 5 నాటి పౌర్ణమికి 3వ తేదీ నుంచే ఇక్కడ నుంచి ఈ బస్సులు బయలుదేరేలా ప్రణాళిక రూపొందించామన్నారు. అరుణాచలం వెళ్లేటప్పుడే కాణిపాకం, శ్రీపురం, కంచి, శ్రీకాళహస్తి దేవాలయాలను కూడా దర్శించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. పౌర్ణమి దర్శనం అయ్యాక ఏడో తేదీన విశాఖలో చేరుస్తామన్నారు. సూపర్ లగ్జరీ సర్వీసుకు రూ.4,000, ఇంద్ర ఏసీ సర్వీసుకు రూ.5,000 చొప్పున ఒక్కొక్కరికి టిక్కెట్టు ధర నిర్ణయించామన్నారు. ఈ యాత్రకు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునే వీలు కల్పించామన్నారు.

పూరీ, భువనేశ్వర్‌లకు కూడా..

మరోవైపు పొరుగున ఒడిశాలోని కొన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు కూడా స్పెషల్ ప్యాకేజీతో బస్సులను నడపనున్నట్టు ఈడీ రవికుమార్ తెలిపారు. పూరీలోని జగన్నాథస్వామి, భువనేశ్వర్‌లోని లింగరాజస్వామి, కోణార్క్ సూర్య దేవాలయం, చిలక సరస్సుల సందర్శనకు ప్రతి వారాంతం (శనివారం)లో వీటిని నడుపుతామన్నారు. ఈనెల 29 నుంచి ఈ బస్సులను ప్రారంభిస్తామన్నారు. ఈ ప్యాకేజీలో (సూపర్ లగ్జరీ) టిక్కెట్టు ధర రూ.2,350గా నిర్ణయించామని చెప్పారు. డిమాండ్‌ను బట్టి ఏసీ సర్వీసులను కూడా ప్రవేశపెడతామన్నారు. అరుణాచలంతో పాటు ఒడిశా పుణ్యక్షేత్రాలకు ఏడాది పొడవునా ఈ టెంపుల్ టూరిజం బస్సులు నడుపుతామని తెలిపారు. మీడియా సమావేశంలో ఆర్టీసీ డీపీటీవో బలిజి అప్పలనాయుడు, డిప్యూటి సీటీఎం జి.సత్యనారాయణ, విశాఖ డిపో మేనేజర్ గంగాధర రావులు పాల్గొన్నారు.

సాగర్ మిత్రల భర్తీకి దరఖాస్తులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద జిల్లా మత్స్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో 15 మంది సాగర్ మిత్రల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిషరీస్‌లో పాలిటెక్నిక్ డిప్లమో, బీఎస్సీ(ఫిషరీస్, సైన్స్/మెరైన్ బయాలజీ/జువాలజీ) విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. జీతం నెలకు రూ.10 వేలు, పనితీరు ఆధారంగా అదనపు ప్రోత్సాహకం కింద నెలకు మరో రూ.5 వేలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా మత్స్యశాఖ సంయుక్త సంచాలకురాలు, ఫిషింగ్ హార్బర్, విశాఖపట్నం అనే చిరునామాకు పంపాలని కలెక్టర్ కోరారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ సబ్ రీజినల్ అధికారి శ్యామ్ సుందర్ నిట్టాల్ తెలిపారు. బజాజ్ క్యాపిటల్ ప్రైవేటు లిమిటెడ్‌లో 30 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలిమేనేజర్, టెలి ఎగ్జిక్యూటివ్, ఉద్యోగాలకు ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 20–28 ఏళ్ల కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగం బట్టి జీతం నెలకు రూ12,000 నుంచి రూ14,000లు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

శనివారమూ అందుబాటులో పాస్‌పోర్టు సేవలు

మురళీనగర్(విశాఖ ఉత్తర): ప్రస్తుతం పాస్‌పోర్టులకు ఉన్న భారీ డిమాండ్ దృష్ట్యా పాస్‌పోర్టు కార్యాలయాలు కొంత కాలం శనివారం కూడా సేవలు అందిస్తాయని విశాఖపట్నం, విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాల ఆఫీసర్ విశ్వాంజలి ఎం.గైక్వాడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుంచి ప్రతి శనివారం విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, భీమవరంలోని పాస్‌పోర్టు జారీ కేంద్రాలు పని చేస్తాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ప్రతి శనివారం 2200 స్లాట్లను రిలీజ్ చేస్తామని తెలిపారు. ఈ నెల 26 ఉదయం నుంచి ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కొత్త దరఖాస్తుదారులతో పాటు, రీషెడ్యూల్ కేటగిరీలో పాస్‌పోర్టులు కావాల్సిన వారు, అపాయింట్‌మెంట్ తేదీలను మార్చుకోవాలనుకునేవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. సాధారణ పనిదినాల్లో(సోమవారం నుంచి శుక్రవారం వరకు) కూడా అదనపు స్లాట్లను ఏర్పాటు చేస్తామన్నారు. విజయవాడ, తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ప్రతి రోజు అదనంగా 50 స్లాట్‌లను రిలీజ్ చేయనున్నామన్నారు. తత్కాల్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వారు అవసరమైన డాక్యుమెంట్లను పాస్‌పోర్టు సేవా ప్రాజెక్టు పోర్టల్‌లో సమర్పించి రీషెడ్యూల్‌ను నివారించవచ్చన్నారు.

చందనోత్సవం లోపాలపై జేసీ విచారణ



టికెట్ల జారీకి సంబంధించి రికార్డులు పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథం

సింహాచలం : ఈనెల 23న జరిగిన చందనోత్సవం నిర్వహణలో చోటుచేసుకున్న వైఫల్యాలపై జాయింట్ కలెక్టర్ విశ్వనాథం మంగళవారం సాయంత్రం దేవస్థానం ఈవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. చందనోత్సవంలో వైఫల్యాలపై విచారణ చేయాల్సిందిగా జేసీ విశ్వనాథ్‌కు కలెక్టర్ సూచించారు. మంగళవారం సాయంత్రం దేవస్థానం పరిపాలనా కార్యాలయంలోను, ఈవో చాంబర్‌లోని ఆయన పలు అంశాలపై విచారణ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చందనోత్సవంలో ఎక్కెడెక్కడ లోపాలు జరిగాయో విచారణ చేస్తున్నామన్నారు. టికెట్లు, వెహికల్ పాస్‌లు జారీ, మంచినీరు కేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటులో ఎక్కెడెక్కడ వైఫల్యాలు జరిగాయో ప్రాథమికంగా విచారణ జరిపామన్నారు. చందనోత్సవానికి సంబంధించి దేవస్థానం అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్, ఎన్ని టికెట్లు జారీ చేశారు, ఎన్ని టికెట్లు ఇష్యూ చేయలేదో, ఎన్ని బ్లాంక్స్ ఉన్నాయో తదితర అంశాలపై విచారణ జరిపామన్నారు. సీసీ టీవీ చెక్‌చేసి పలువురుని విచారించాల్సి ఉందన్నారు. నాలుగు రోజుల్లో నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. దేవస్థానం ఏఈవో ఆనంద్ కుమార్, రమణమూర్తి, సూపరింటిండెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను విచారించారు. దేవస్థానం ఎస్‌డీసీ రామలక్ష్మి, చినగదిలి తాహసీల్దార్ రమణయ్య, జిల్లా ఇన్ఫర్మేషన్ ఆధికారి భాషా, ఆర్‌ఐ ప్రవీణ్‌కుమార్, వీఆర్‌వో జామిరాము పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవోగా శిరీష



డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష నియమితులయ్యారు. ఇంతవరకూ ఈవోగా విధులు నిర్వహిస్తున్న కె.రమేష్‌నాయుడు కృష్ణాజిల్లా తిరుపతమ్మ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. సహాయ కమిషనర్ బాధ్యతలతో పాటు కనకమహాలక్ష్మి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలను శిరీష నిర్వహించనున్నారు. గతేడాది జూలై ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 29వరకు ఆమె కనకమహాలక్ష్మి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆలయ ఆదాయం పెంపు, భక్తులకు సౌకర్యాలతో పాటు అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు నిర్వహించి అందరి ప్రశంసలు పొందారు. ముఖ్యంగా అమ్మవారి దత్తత దేవాలయం అంబికాబాగ్ రామచంద్ర స్వామి దేవస్థానం ఆస్తులు, అనకాపల్లిలో అన్యాక్రాంతం కాగా వాటిని స్వాధీనం చేసుకొని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. దీంతో శిరీషాను అమ్మవారి దేవస్థానం ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకట్రెండు రోజుల్లో శిరీష ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

కోస్టల్ రీసెర్చ్ లేబొరేటరీ ప్రారంభం



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం జువాలజీ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన కోస్టల్ రీసెర్చ్ లేబొరేటరీని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, ఎన్‌సీసీఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రమణ మూర్తి, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, ఎన్‌సీసీఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ మిశ్ర, డాక్టర్ శివాజి పాత్ర పాల్గొన్నారు.

బిల్డర్‌కు ఐదేళ్ల జైలు, జరిమానా

విశాఖ లీగల్: వినియోగదారులను మోసం చేసిన బిల్డర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ న్యాయమూర్తి జె.పద్మావతి మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండేళ్ల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.శేషుబాబు వివరాల ప్రకారం.. ఒకటో నిందితుడు పట్టపు ఆనంద్ అరుణ్ కుమార్ కూర్మన్నపాలెంలో ఉంటున్నాడు. వృత్తిరీత్యా బిల్డర్. కూర్మన్నపాలెంలో 2013లో అక్షిత హైట్స్ పేరుతో ఓ అపార్టుమెంట్ నిర్మించాడు. మరో నిందితుడు అరుణ్ కుమార్, నాల్గో నిందితుడు డి.చంద్రశేఖర్ సహకారంతో ఈ అపార్ట్‌మెంట్‌లో ఒకే ఫ్లాటును ఐదుగురికి విక్రయించాడు. కొనుగోలుదారులందరూ స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రుణం తీసుకున్నారు. ఈ ఫ్లాట్లు తొలుత కొనుగోలు చేసిన వ్యక్తి సొమ్ము చెల్లించాడు. మిగిలిన వారు చెల్లించకపోవడంతో అనుమానం వచ్చి బ్యాంకు అధికారులు సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో ఆరుగురు నిందితులు ఉన్నారు. రెండో నిందితుడు చనిపోయారు. 3, 5, 6 వ్యక్తులపై నేరం రుజువు కాలేదని న్యాయవాది తెలిపారు.

కేజీహెచ్‌లో రోగులు, సహాయకులకు

అధిక ప్రాధాన్యం



సత్రం ఆవరణలో శిలా ఫలకం ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని, కలెక్టర్ మల్లికార్జున, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- రూ.50 లక్షలతో ఆధునికీకరించిన 200 పడకల సత్రం ప్రారంభం



సత్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న మంత్రి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కేజీహెచ్‌లో వైద్యం కోసం వచ్చే రోగులతో పాటు వారి సహాయకులకు అధిక ప్రాధాన్యమిస్తూ మెరుగైన వసతులు కల్పిస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని తెలిపారు. కేజీహెచ్‌లో రూ.50 లక్షల నిధులతో ఆధునికీకరించిన 200 పడకల సత్రాన్ని మంత్రి విడదల రజిని మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఇందులోని వసతి గదులు, బెడ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ సీఎస్‌ఆర్ ఫండ్ నుంచి రూ.30 లక్షలు, ఇస్కాన్ సంస్థ అందించిన మరో రూ.20 లక్షలతో భవనాన్ని ఆధునికీకరించామన్నారు. ఈ సత్రంలో 8 బ్లాకుల్లో ఒక్కొక్క బ్లాక్‌లో 25 బెడ్స్ ఏర్పాటు చేశామన్నారు. సత్రం నిర్వహణ బాధ్యతలు ఇస్కాన్ సంస్థ చేపడుతుందన్నారు. ఒక్కొక్క బెడ్ నుంచి రూ.50 సాధారణ రుసుం వసూలు చేసి మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందిస్తారని మంత్రి వివరించారు. అధునాతన వైద్య పరికరాల కోసం రూ.2.66 కోట్లు, 10 అంబులెన్స్‌ల కోసం రూ 2.5 కోట్లు ఇవ్వడానికి హెచ్‌పీసీఎల్ సంస్థ కేజీహెచ్‌తో ఒప్పందం చేసుకుందని ఆమె తెలిపారు. అంతకు ముందు మంత్రి రజిని సత్రం ఆవరణలో కలెక్టర్ ఎ.మల్లికార్జున, మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నాడు–నేడు కింద సత్రంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, ఏపీ ఎంఐడీసీ, ఈఈడీఏ నాయుడు, డీఈ మన్మథరావు, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్న, సూరిన రాము, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో నాణ్యమైన బోధన

జిల్లా జీసీడీవో సూర్యకుమారి

గంగవరం: కేజీబీవీలో నాణ్యమైన విద్యా బోధన అందుతుందని, బడి బయట బాలికలను చేర్పించాలని జిల్లా జీసీడీవో సూర్యకుమారి తెలిపారు. మండలంలోని కొత్తాడ కేజీబీవీని ఆమె మంగళవారం సందర్శించారు. విద్యాలయం రికార్డులను, స్టాక్, పిల్లల హాజరు పట్టికను తనిఖీ చేశారు. బాలికలకు అందుతున్న సౌకర్యాలను ఆరా తీశారు. విద్యాలయంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తాడలో నిర్వహించిన ప్రచార ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. బడి బయట పిల్లలను పాఠశాల మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తించి విద్యాలయాల్లో చేర్పిస్తున్నామన్నారు. విద్యాలయంలో అన్ని రకాల మౌలిక సౌకర్యాలతోపాటు మంచి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన బడి ఈడు బాలికలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వి.వి. లక్ష్మి, ఉపాధ్యాయులు సూర్యకాంతం, కృష్ణవేణి, అనంతకుమారి పాల్గొన్నారు.

సింగర్భలో చక్కుల పండగ

అనంతగిరి: గిరిజన గ్రామాల్లో గిరిజనులు జీవనవిధానం వైవిధ్యంగా ఉంటోంది. గిరిజన ఆచార సంప్రదాయాలు విభిన్నంగా ఉంటాయి. ఏజెన్సీ వ్యాప్తంగా ఇటీవలే ఇటుకల పండగ ముగియడంతో మరి కొన్ని గ్రామాల్లో చక్కుల పండగ ప్రారంభమైంది. ఇందులో భాగంగా అనంతగిరి మండలం కొండిబ పంచాయతీ సింగర్భ గ్రామంలోని ఏడు గిరిజన గ్రామాల గిరిజనులు ఒకచోట చేరుకుని, చక్కుల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ పండగ తర్వాత పొలాల్లో విత్తనాలను జల్లుతారని ముఠా నాయకులు కృష్ణమూర్తి, పూజారి లైకోన్, గ్రామ పెద్దలు పరశురాం, కిల్లో అప్పన్న తెలిపారు. సింగర్భ గ్రామంలోని తోకవలస, నమిడివలస, సీసాముండ, బొరిబొరివలస, కోసమామిడి, జామిగుడ గ్రామాల గిరిజనులు ఈ పండగలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పందిరి వేసి, థింసా నృత్యాలతో రాత్రంతా ఆనందంగా గడుపుతారు. ఈ పండగలో మహిళలు పంచెకట్టులో దర్శనమివ్వడం విశేషం.

నేటి నుంచి స్ట్రక్చర్ సర్వే



వివరాలు తెలుపుతున్న తహసీల్దార్ అనసూయ

కూనవరం: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపులో ప్రయారిటీ హాబిటేషన్లుగా గుర్తించిన గ్రామాల్లో బుధవారం నుంచి స్ట్రక్చర్ (గృహాల) సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.అనసూయ మంగళవారం తెలిపారు. కూనవరం, టేకులబోరు, కొండ్రాజుపేట, శబరికొత్తగూడెం, పంద్రాజుపల్లి, పెదార్కూరు, టేకుబాక గ్రామాల్లో ప్రత్యేక బృందాలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తాయన్నారు. ఈ సర్వే బృందంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టీకల్చర్ అసిస్టెంట్, అటవీశాఖ అధికారి, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉంటారని పేర్కొన్నారు. ప్రతి ఇంటి యజమాని అందుబాటులో ఉండి, సంబంధిత రికార్డులు, ఇంటిపన్ను రసీదులు, ఆధార్, రేషన్‌కార్డులు తదితర డాక్యుమెంట్లు దగ్గర ఉంచుకోవాలని, సర్వే బృందాలకు సహకరించాలని తెలిపారు.

వాగుల్లో ఇసుక తవ్వితే కఠిన చర్యలు



వేటమామిడి వద్ద కన్నేరు వాగు ఒడ్డున హెచ్చరిక బోర్డు

అడ్డతీగల: కొండవాగుల్లో అనుమతుల్లేకుండా ఇసుకను తవ్వుకుపోతున్న ఇసుకాసురులకు రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. మండలంలోని వేటమామిడి పవర్ ప్రాజెక్ట్ సమీపాన కన్నేరు వాగులో ఇసుకను అనుమతి లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లపై తరలించుకుపోతున్న వైనంపై ఈ నెల 23న 'కన్నేశారు.. తవ్వేస్తున్నారు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు వేటమామిడి వీఆర్వో శిరీష, ఇతర సిబ్బంది కన్నేరు వాగు చెంతనే మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంతోపాటు కొండవాగుల్లో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సిహెచ్.శ్రీనివాసరావు హెచ్చరించారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం



పుట్టిన బిడ్డను బంధువులకు అప్పగిస్తున్న ఈఎంటీ ప్రేమ్‌కుమార్

మారేడుమిల్లి: మండలంలోని చావడికోట పంచాయతీ బంద గ్రామానికి చెందిన గర్భిణి సాదల విజయలక్ష్మి మంగళవారం 108 అంబులెన్స్‌లో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు పురిటి నొప్పులు రావడంతో బంధువులు బోదులూరు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ క్రమంలో 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా భూపతిపాలెం ప్రాజెక్ట్ సమీపం వద్ద పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ ఎం. ప్రేమ్‌కుమార్, పైలట్ బి. దనుంజయ్ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని రంపచోడవరం ఆస్పత్రిలో చేర్పించామని 108 సిబ్బంది తెలిపారు.